క్లుప్తంగా

రెండు నెలలుగా అందని వేతనాలు

ఖమ్మంరూరల్: మండలంలోని 12 గ్రామపంచాతీలతో నూతనంగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు గత రెండు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలో మొత్తం 186 మంది పారిశుద్ధ్య, తాగునీటి సరఫరా విభాగాల్లో పని చేస్తుండగా.. వీరికి రెండు నెలలకు కలిపి రూ. 60 లక్షలు వేతనాలు రావాల్సి ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే వేతనాలు అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

24న గిరిప్రసాద్ వర్ధంతి సభ

ఖమ్మం మామిళ్లగూడెం: సీపీఐ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్లమల గిరిప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా ఈనెల 24న ఖమ్మం రిక్కాబజార్ హైస్కూల్ గ్రౌండ్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే ఈ సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.

జాతీయ నెట్‌బాల్ టోర్నీకి ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల జనగాం జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ నెట్‌బాల్ పోటీలకు నగరంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌కు చెందిన స్నేహిత్, సాహిత్, సాకేత్, సంజయ్, నేహాల్, ఎం.సూర్యలు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 25 నుంచి మధ్యప్రదేశ్‌లో జరిగే నెట్‌బాల్ జాతీయ టోర్నీలో పాల్గొనున్నారు. ఈమేరకు సీబీఎస్‌ఈ స్కూల్ సిస్టర్ మరియ సుందరి, ప్రిన్సిపాల్ ఆరోగ్యమేరీ, పీఈటీ మురళిలు వారిని అభినందించారు.

కార్పొరేటర్ భర్తతో ఏఈఈ వాగ్వాదం

ఖమ్మంమయూరిసెంటర్: ఓ కార్పొరేటర్ భర్తతో కేఎంసీ ఏఈఈ వాగ్వాదానికిదిగినట్లు తెలిసింది. సదరు ఏఈఈ దురుసుగా వ్యవహరించినట్లు సమాచారం. దీంతో సదరు ఏఈఈను ఆ డివిజన్ బాధ్యతల నుంచి తొలగించి, మరో ఏఈఈకి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఏఈఈ వ్యవహారశైలిపై కార్పొరేటర్ భర్త ఉన్నతాధికారుల వద్ద ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

పశుగ్రాసం వితరణ



ఖమ్మంఅర్బన్: నగరంలోని గొల్లగూడెం ఓం శ్రీకృష్ణ గోశాలకు పలువురు దాతలు పశుగ్రాసం కోసం మంగళవారం ఆర్థిక సాయం అందించినట్లు గోశాల నిర్వాహకులు తెలిపారు. ఈనేపథ్యాన నాగేశ్వరరావు ఒక ట్రాక్టర్ గ్రాసం కోసం రూ.6100, సుబ్రమణ్యేశ్వరి-శ్రీనివాసరావు దంపతులు ఒక ఆటో గ్రాసం అందించినట్లు పేర్కొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	హిట్: ది థర్డ్ కేస్
వినోద	సింగిల్
సాయిరాం	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్
ఆదిత్య	యమదొంగ
శ్రీనివాస	ఎలెవన్, దేశముదురు

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	30		20
కాకర	60	చుక్కకూర	3
బీర	56		20
దొండ	24	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	108	గోంగూర	4
గోరుచిక్కుడు	50		20
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	35		20
ఆలుగడ్డ	24	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	50	పుదీన	1
క్యాప్సికం	60		20
బీట్‌రూట్	30	-ఖమ్మం వ్యవసాయం	

కమ్మేస్తున్న కంపచెట్లు..

- రాకపోకలకు తీవ్ర ఆటంకం
- ముళ్లచెట్లు తగిలి వాహనదారులకు గాయాలు
- పట్టించుకోని అధికారులు



బావోజీతండా నుంచి పంగిడి రోడ్డులో అల్లుకున్న కంపచెట్లు

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామీణ రహదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఆటంకంగా మారాయి. రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి రోడ్లపైకి విస్తరించడంతో రవాణా సమయాన వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నిత్యం వ్యవసాయ పనులకు రాకపోకలు సాగించే వారు ఇటువంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని వీవీ పాలెం నుంచి వేపకుంట్ల, చింతగుర్తి రోడ్డు, రఘునాథపాలెం నుంచి జింకలతండా, పరికలబొడు తండా, మల్లేపల్లి బావోజీతండా తదితర గ్రామాలకు వెళ్లే లింకు రహదారులన్నీ కంపచెట్లు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్ని చోట్ల వాహనాలు వెళ్లేందుకు దారే కనిపించని పరిస్థితి నెలకొంది. పగటి వేళల్లోనే ఈ రహదారులపై ప్రయాణించడం సాహసంగా మారితే, రాత్రి వేళల్లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రహదారి మొత్తం కంపచెట్ల మధ్య నిక్షిప్తమై ఉండడంతో రవాణా ప్రాణసంకటంగా మారింది. ఇప్పటికే పలువురు వాహనదారులకు కంపచెట్లు తగిలి గాయాల పాలైన ఘటనలు కూడా ఉన్నాయి. ఇన్నాళ్లుగా ఈ సమస్యను అధికారులకు విన్నవిస్తున్నా స్పందించడంలేదని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. గ్రామీణ రోడ్లను కంపచెట్ల నుంచి విముక్తి కల్పించి, రాకపోకలకు అనువుగా మార్చాలని కోరుతున్నారు. పచ్చదనం పేరుతో గ్రామీణ రహదారులను ఆక్రమిస్తున్న కంపచెట్లను తొలగించేందుకు పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖలు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆశిస్తున్నారు.



కామేపల్లి: ఖమ్మం-ఇల్లెందు రహదారి పక్కన ముళ్ల పొద

రవాణాకు ఆటంకంగా..

కామేపల్లి: పండితాపురం నుంచి కామేపల్లి క్రాస్ రోడ్డు వరకు ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రహదారి వెంబడి ఉన్న ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలు రవాణాకు ఆటంకంగా మారాయి. రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగి రోడ్డుపైకి రావడంతో రాత్రి సమయాల్లో అవి కనబడక ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రయాణికులు గాయాలవుతున్నారు. నిత్యం ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలను తొలగించి వాహనదారుల ఇబ్బందులు తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ



తిరుమలాయపాలెం: శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

తిరుమలాయపాలెం/ఖమ్మంరూరల్: విద్యాబోధనలో నాణ్యతా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా తరగతులు మంగళవారం తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ఎఫ్ఎల్ఎం కార్యక్రమాల అభివృద్ధిలో భాగంగా రిసోర్స్ పర్సన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండలంలోని ఆయా పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో పాఠాలు బోధించి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. విద్యా వ్యవస్థలో నేడు ఆంగ్ల భాషలో బోధించడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎం.శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్యాంసన్, శాంతిసుధ, భాస్కర్‌రావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఇంటర్ విద్య కొనసాగించాలి



ఏఆర్‌సీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఇంటర్ విద్యను తొలగిస్తూ రాష్ట్ర గురుకుల సెక్రటరీ తీసుకున్న నిర్ణయం సరికాదని, దీనివల్ల దళిత విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంటుందని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. ఈమేరకు మంగళవారం పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఎస్సీ గురుకుల జోనల్ ఆఫీస్‌లో ఏఆర్‌సీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, సత్తుపల్లి, భద్రాచలం కేంద్రంగా ఉన్న ఎస్సీ బాలికల, బాలుర గృహాలు, రాష్ట్రంలోని 12 ఎస్సీ గురుకులాల్లో ఇంటర్ విద్యను దూరం చేశారన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి యథాతథంగా ఇంటర్‌ను కొనసాగించకపోతే విద్యార్థి, ప్రజా ఉద్యమాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు యశ్వంత్, ప్రసాద్, పేరాల వెంకటేష్, అనిల్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



డీలర్లతో మాట్లాడుతున్న ఏడీఏ సరిత

తిరుమలాయపాలెం: అనుమతులు లేని నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని కూసుమంచి ఏడీఏ సరిత హెచ్చరించారు. మంగళవారం మండలంలోని దమ్మాయిగూడెం రైతు వేదికలో మండల విత్తన డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున డీలర్లు లైసెన్స్ కల్గిన కంపెనీ విత్తనాలనే రైతులకు అమ్మి, తప్పకుండా బిల్లులు ఇవ్వాలని, వాటి మీద రైతు, డీలర్ల సంతకం పెట్టాలని పేర్కొన్నారు. ప్రతీ షాపులోని స్టాక్ బోర్డులో ధరల పట్టిక ఉండాలని, రోజువారీ అమ్మకాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని తెలిపారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలతో పాటు లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. విత్తన కొరతను సృష్టించకుండా మార్కెట్ రేటు ప్రకారం విత్తనాలు అమ్మాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారామరెడ్డి ఆయా గ్రామాల విత్తన డీలర్లు పాల్గొన్నారు.

పార్కింగ్ చార్జీల పేరుతో నిలువుదోపిడీ..



స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ చార్జీల పేరుతో నిలువుదోపిడీ చేస్తున్న రైల్వే పార్కింగ్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్‌లో టూ వీలర్ పార్కింగ్‌లో పెడితే గంటకు రూ.10 చొప్పున రెండు రోజులకు అక్షరాల రూ.485 వసూలు చేస్తున్నారని, అదే నాలుగు చక్రాల వాహనాలకు డబుల్ చార్జీ వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఒక ప్రయాణికుడు తను వెళ్లాల్సిన రైళ్ల టిక్కెట్ కంటే పార్కింగ్‌కు అయ్యే చార్జీలే ఎక్కువవుతున్నాయని ఆరోపించారు. అనంతరం పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి కనీస సౌకర్యాలు కల్పించాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జబ్బార్, దొంగల తిరుపతిరావు, ఎస్.నవీన్ రెడ్డి, బి.మధు, శ్రీనివాసరావు, నాగుల్‌మీరా, బండారు యాకయ్య, మొటమర్రి జగన్మోహన్‌రావు, గుమ్మడి భిక్షం, వినోద్ తదితరులు పాల్గొన్నారు

కార్మిక చట్టాల రద్దును నిరసిస్తూ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

ఖమ్మంరూరల్: కార్మిక చట్టాల రద్దును పాలకులు విరమించుకోవాలని కోరుతూ మంగళవారం మండలంలోని జలగంనగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులైన అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజన వర్కర్లు,, గ్రామపంచాయతీ కార్మికులు, స్కీం వర్కర్లకు కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో మోదీ ప్రభుత్వం 2020లో రద్దు చేసి కార్మికులను బానిసలుగా చేసే నాలుగు కార్మిక కోడులను తీసుకురావడం దారుణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడికొండ నాగేశ్వరరావు, గూడా రాంబ్రహ్మం గౌడ్, ఎరకల. సుబ్బయ్య, లీలావతి, రాములమ్మ, ఉమారాణి, వీరమ్మ, కె. ఉపేందర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యాన..

ఖమ్మం అర్బన్: కార్మిక చట్టాల సవరణలకు వ్యతిరేకంగా భవన నిర్మాణ కార్మికులు మంగళవారం నిరసన చేపట్టారు. తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన బల్లేపల్లి స్టేజీ నుంచి పాండురంగాపురం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు అందుతున్న ప్రయోజనాలను కూడా నిలిపివేస్తున్నట్లు తీసుకుంటున్న నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ నిరసనలో భాగంగా కార్మికులు స్వచ్ఛందంగా పనులు నిలిపివేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వేముల ఉపేందర్, కిషన్‌రావు, రాము, కృష్ణ, వెంకట్, చంద్రం, శీను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ తీస్తున్న నాయకులు

అటెన్షన్ ప్లీజ్

వెలగని వేపకుంట్ల..

మండలంలోని వేపకుంట్ల గ్రామంలో వెలుగులు నింపిందుకు గ్రామ చౌరస్తాలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ వీధి లైటు గత కొన్ని నెలలుగా పని చేయడం లేదు. దీంతో చిమ్మచీకట్లో గ్రామస్తులు నర(డ)కయాతన అనుభవిస్తున్నారు. లక్షలాది రూపాయలతో ఏర్పాట్లు చేసిన హైమాస్ట్ లైట్లు మూణ్నాళ్ల ముచ్చటగానే ఉన్నాయని, పలు సందర్భాల్లో రాత్రి సమయాన ప్రమాదాల బారిన పడే పరిస్థితులు ఎదురవుతున్నాయని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా లైటుకు మరమ్మతులు చేయించి గ్రామానికి వెలుగులు నింపాలని నివాసులు కోరుతున్నారు.

- రఘునాథపాలెం



వేపకుంట్లలోని హైమాస్ట్ లైట్

ఆర్థికసాయం అందజేత

మృతుల కుటుంబాలకు..



ఖమ్మంరూరల్: కామంచికల్‌లో ఆర్థిక సాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలకు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించిన ఆర్థికసాయాన్ని అందించారు. ఈ మేరకు నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో 10 మంది ఇటీవల మృతి చెందగా.. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, రాయపూడి నవీన్, హనుమంతరావు, నల్లాని మల్లికార్జున్‌రావు, యం.వెంకన్న, కడియాల నరేష్, ఖాజామియా, ముత్తయ్య, మారగాని అంజయ్య, యడవల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంరూరల్ మండలం గుదిమళ్ల, గుర్రాలపాడు, వెంకటగిరి, తెల్దారుపల్లి, తల్లంపాడు, కామంచికల్ గ్రామాలకు చెందిన 26 కుటుంబాలకు సైతం రూ. 10వేల చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, మద్ది కిషోర్ రెడ్డి, మద్ది వీరారెడ్డి, మొక్క శేఖర్‌గౌడ్, తేజావత్ పంతులునాయక్, వెంకటనారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెయింటర్‌కు..

ఖమ్మం అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న పెయింటర్ అక్కినపల్లి రమేష్‌కు టూవీలర్ మెకానిక్ యూనియన్ బాధ్యులు మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. టూవీలర్ మెకానిక్ యూనియన్ అనుబంధంగా ఉన్న రమేష్ 20ఏళ్లుగా పెయింటింగ్ వృత్తిలో కొనసాగుతున్నాడు. ఇటీవల ఆయనకు జరిగిన ప్రమాదంలో పనిచేయలేని పరిస్థితి ఎదురవగా యూనియన్ అధ్యక్షుడు వంగాల కొండల్‌రావు నగదు అందజేశారు. అన్వర్, లింగన్న, బోయిన మురళి, బైరోజు శేషు, నాగరాజు, నాగులు, మీరా షేక్, సుభాని, నరేందర్ పాల్గొన్నారు.

వధువుకు పుస్తె, మెట్టెలు..

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడికి చెందిన గాడిచర్ల శ్రీను - ఆదిలక్ష్మి దంపతుల కుమార్తె నాగజ్యోతి వివాహం సందర్భంగా మాజీ ఉపసర్పంచ్ గుత్తా వెంకటేశ్వర్లు - చంద్రకళ దంపతులు మంగళవారం పుస్తె, మెట్టెలు అందజేశారు. కాలింగి వీరబాబు, మద్దుల నాగేశ్వరరావు, గుండ్ల ముత్తయ్య, కాలింగి వాసు, గాడిచర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ శ్రీనగర్-మధురానగర్ కాలనీలో గల సమర్థ సద్గురు సాయినాథ మందిరంలో రేపు (గురువారం) ఉదయం 8:30 గంటలకు శ్రీ దాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జరుగనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ, నారాయణసేవలో పాల్గొనాలని పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందన్నారు. ప్రతి నెలా మొదటి, మూడవ గురువారాల్లో ఆలయంలో అన్నప్రసాద వితరణ కొనసాగుతుందని, రెండవ గురువారం అన్నం సేవా ఫౌండేషన్ ద్వారా అన్నదానం ఉంటుందన్నారు.

కేఎంసీలో వారికే వత్తాసు..



అక్రమాలకు పాల్పడుతున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది

- రిజెక్ట్ ఫైళ్లను అప్రూవ్ చేస్తున్న వైనం
- పనిలేని చోట ముగ్గురికి విధులు
- కంప్యూటర్ ఆపరేటర్లను కాపాడుకునే పనిలో కొందరు అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరపాలక సంస్థలో ఉన్నతాధికారులు పాలనను గాడిన పెట్టేందుకు చర్యలకు ఉపక్రమిస్తుంటే.. మరోపక్క వారి కింది స్థాయి అధికారులు, సిబ్బంది ఆ చర్యలకు గండికొడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రెండుమూడేళ్లుగా కేఎంసీలోని ఔట్ సోర్సింగ్ సిబ్బంది పెత్తనం, వారి అక్రమాలపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా కంప్యూటర్ ఆపరేటర్లు(సీఓ) పెద్ద స్థాయిలోనే అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆర్ఐ, ఆర్‌ఓలు, అసిస్టెంట్ కమిషనర్, కమిషనర్ రిజెక్ట్ చేసిన రెవెన్యూ ఫైళ్లను కూడా ఆన్‌లైన్‌లో అప్రూవల్ ఇచ్చే స్థితికి వెళ్లిందని తెలుస్తోంది. సీఓ అక్రమాలతో తమకు షోకాజ్ నోటీసులు ఇచ్చారని ఇటీవల రెవెన్యూ విభాగ అధికారులు చెబుతుండడం గమనార్హం. ఒకరిద్దరి సీఓలపై చర్యలు తీసుకునేందుకు ఉపక్రమిస్తున్నా.. ఒకరిద్దరు అధికారులు అడ్డుపడుతున్నట్లు తెలిసింది.

పెద్ద సంఖ్యలోనే..

ఏ ప్రభుత్వ కార్యాలయంలో లేని విధంగా ఖమ్మం నగర పాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సంఖ్య భారీగా ఉంది. ఇక్కడ 25 మంది కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వీరిలో చాలా మంది ఎవరు ఎక్కడ పని చేస్తున్నారో అధికారులకు కూడా తెలియని పరిస్థితి ఉంది. హాజరు నమోదులో, జీతాల చెల్లింపుల్లో వీరి పేర్లు కనిపిస్తాయి కాని.. కార్యాలయంలో మాత్రం ఎక్కడ పనిచేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. అలాంటి సీఓలను కాపాడుకునేందుకు ఉద్యోగులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది.

పనిలేని చోట..

ఉన్నతాధికారుల ఆదేశాలతో కంప్యూటర్ ఆపరేటర్లకు తాజాగా విధులు కేటాయిస్తున్నారు. జోనల్ కార్యాలయాలతో పాటు కేఎంసీ కార్యాలయంలోని పలు విభాగాలకు వీరిని కేటాయిస్తూ ఆర్డర్లు తయారు చేస్తున్నారు. అయితే ఈనెల 14వ తేదీన రూపొందించిన ఒక ఆర్డర్‌లో ఐదుగురు కంప్యూటర్ ఆపరేటర్లకు విధులు కేటాయిస్తూ పొందుపరిచారు. ప్రస్తుతం పెద్దగా పనిలేని ప్రజాపాలన హెల్ప్‌డెస్క్‌కు ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లను కేటాయిస్తూ నిర్ణయించారు. ఇప్పటికే ఇక్కడ ఒక కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వర్తిసుండగా.. మరో ఇద్దరిని అదనంగా నియమించడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రజాపాలనకు సంబంధించి కొత్త దరఖాస్తులు తీసుకునేందుకు ఆన్‌లైన్ లేదు. కేవలం పూర్వపు దరఖాస్తుల్లో స్వల్ప మార్పులకే అవకాశం ఉన్న తరుణంలో పని లేని ప్రజాపాలన హెల్ప్‌డెస్క్‌కు ముగ్గురిని నియమించడమేంటని ప్రశ్నిస్తున్నారు.

ఆదేశాలు బేఖాతరు..

కేఎంసీలో తాజాగా జరుగుతున్న పరిణామాలను చూస్తే ఉన్నతాధికారులు ఆదేశించేది ఒకటి.. ఆర్డర్లు తయారు చేసేది ఇంకోరకంగా ఉందనే వాదనలు ఉన్నాయి. ఉన్నతాధికారులు వీటిపై కఠినంగా వ్యవహరించకుంటే కేఎంసీని ఔట్ సోర్సింగ్ సిబ్బందితో కలిసి కొందరు అధికారులు మరింత భ్రష్టు పట్టిస్తారనే చర్చ కొనసాగుతోంది.

అడ్డదారిలో కొలువులు ఇచ్చేందుకు ప్రయత్నాలు..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అక్రమ నియామకాలు ఆగడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ముగ్గురు వ్యక్తులను అక్రమంగా విధుల్లో చేర్చేందుకు కొందరు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఓ కాంట్రాక్టర్ ద్వారా ముగ్గురు వ్యక్తులను విధుల్లో చేర్చుకొని, వారికి బిల్లు కలెక్టర్ స్థాయి పోస్టింగ్ ఇచ్చేందుకు ఫైళ్లను కూడా సిద్ధం చేసినట్లు చర్చ జరుగుతోంది. ఇక పక్క మున్సిపాలిటీలో పని చేసే కొందరు వ్యక్తులు కేఎంసీలో నిత్యం పలు విభాగాల చుట్టూ తిరుగుతున్నారని, వీరు ఎవరి అనుమతులు లేకుండానే అధికారుల గదుల్లోకి వెళ్లి కీలక సమాచారం తెలుసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. సదరు వ్యక్తులు కేఎంసీలో అడ్డదారిలో ఔట్ సోర్సింగ్ విధానంలో విధుల్లో చేరేందుకు ప్రయత్నాలు ప్రారంభించారన్న చర్చ ఉంది.